నేలకొరిగిన పంట.. ఆందోళనలో అన్నదాత


హాజీపూర్ మండలం పెద్దంపేటలో నేలవాలిన వరి పంట

హాజీపూర్, న్యూస్‌టుడే: మండలంలో శనివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన అకాల వర్షానికి పలు గ్రామాల్లో పత్తి, వరి పంటలు పూర్తిగా నేలవాలాయి. మండలంలోని పెద్దంపేట, గొల్లపల్లి, బుద్ధిపల్లి గ్రామాల్లో పలువురు రైతులు సాగు చేసిన వందలాది ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. చేతికందే సమయంలో వర్షం పంటను దెబ్బ తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయాధికారులతో సర్వే చేయించి నష్టపరిహారం అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

భీమారం: మండలంలోని పోలంపల్లి గ్రామ శివారులో నక్క రాజన్న, నక్క మల్లేష్, రవీందర్ రెడ్డిలతో పాటు పలువురు రైతులకు చెందిన సుమారు 30 ఎకరాల వరి పైరు నేలవాలింది. పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలతో నష్టం ఏర్పడిందని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు.


గొల్లపల్లిలో దెబ్బతిన్న వరి పంటను చూపుతున్న రైతు గురువయ్య

ఇది ఉట్నూరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బిగించిన సౌరశక్తితో నీళ్లను వేడిచేసే పరికరం(సోలార్ వాటర్ హీటర్). ఇక్కడ 600 మంది గిరిజన విద్యార్థినులు చదువుతున్నారు. సౌర విద్యుత్తు పరికరాలు ఏర్పాటు చేసిన కొన్ని రోజులే పని చేశాయి. ఆ తరువాత ఏమాత్రం నీరు వేడి కావడం లేదని విద్యార్థినులు వాపోయారు. చలికాలంలో చన్నీటితో స్నానం చేయాల్సిన దుస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



స్పందించాలి సారు.. అందించాలి వేడినీరు

● ఆశ్రమ పాఠశాలల్లో నిరుపయోగంగా యంత్రాలు

న్యూస్‌టుడే, ఉట్నూరు

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు చలికాలంలో చన్నీటితో స్నానం చేసి అనారోగ్యం బారినపడకుండా వారికి వేడి నీళ్ల సౌకర్యం కల్పించేందుకు సౌరశక్తితో పని చేసే సౌర నీటి యంత్రాలను బిగించారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఉట్నూరు ఆధీనంలోని ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాలు కలిపి మొత్తం 104 పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు చలికాలంలో చన్నీటితో స్నానం చేసి అస్వస్థతకు గురికావొద్దనే సదాశయంతో ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ పథకం(ఐఏపీ) నిధులతో తెలంగాణ పునరుద్ధరణీయ వనరుల అభివృద్ధి(టీఎస్ఎన్ఆర్ఈడీసీ) ద్వారా సోలార్ హీటర్లను బిగించింది. అవి మూన్నాళ్లముచ్చటగా మారాయి.




వేడి నీరు రాక స్నానం చేయడానికి చేతిపంపు వద్ద నీళ్లను నింపుకొంటున్న గిరిజన విద్యార్థినులు(పాత చిత్రం)

ఒక్కోదానికి రూ.3 లక్షలు..

ఒక్కో పాఠశాలలో సౌర పలకలు, సింథటిక్ ట్యాంకు, ఇతర పరికరాలు కలిపి ఒక్కో సౌర వాటర్ హీటర్ ప్లాంటుకు రూ.3 లక్షల వ్యయంతో టీఎస్ఎన్ఆర్ఈడీసీ సంస్థ, ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ సహకారంతో వీటిని బిగించారు. మొత్తం 104 పాఠశాలల్లో రూ.3.12 కోట్లు ఖర్చు చేశారు. అధికారుల పర్యవేక్షణ లేమితో రూ.కోట్లు వెచ్చించి బిగించిన సౌర విద్యుత్తు పరికరాలు నిరుపయోగంగా మారాయి.

నిర్వహణ గాలికి..

సౌర వాటర్ హీటర్ల కోసం టీఎస్ఎన్ఆర్ఈడీసీకి రూ.3.12 కోట్లను ఐటీడీఏ మంజూరు చేసింది. ఆ సంస్థ పరికరాలను బిగించింది. నిర్వహణ మాత్రం విస్మరించింది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు ఆ సంస్థ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.

☛ ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాను వివరణ కోరగా.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

సాగుతున్న పనులు.. నాణ్యతకు తూట్లు

● మిషన్ భగీరథ పథకం తీరిది..

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే

మంచిర్యాల పురపాలికలో రెండేళ్ల కిందట చేపట్టిన మిషన్ భగీరథ పనులు నేటికీ పూర్తి కాలేదు. పనుల్లో నాణ్యత పాటించడం లేదు. కొత్తగా నిర్మించిన ట్యాంకుల నుంచి నీళ్లు లీకేజీ కావడంతో మళ్లీ తాత్కాలిక మరమ్మతులు చేశారు. అంతర్గత పైప్‌లైన్ల లీకేజీలతో తాగునీరు కలుషితం అవుతోందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. భగీరథ పైప్‌లైన్ల నిర్మాణానికి పట్టణంలో అనేక రహదారులు ధ్వంసం చేశారు. వాటికి మరమ్మతులు చేయలేదు.


మంచిర్యాలలోని అండాళమ్మ కాలనీలో జాల గుట్ట కింద నిర్మించిన సంప్

◆ మంచిర్యాల పట్టణంలో 2020-21లో మిషన్ భగీరథ పథకం పనులకు రూ.99 కోట్లు నిధులు మంజూరు చేశారు. 24 నెలల్లో పనులు పూర్తి చేయాలి. కానీ 36 నెలలు దాటినా ఇంకా పూర్తి కాలేదు. స్థానిక అండాలమ్మకాలనీలో జాల గుట్టపై సంప్, కింది భాగంలో మరో పంప్, ట్యాంకు నిర్మించారు. వేములబస్తీ, సున్నంబట్టి వాడల్లో మరో రెండు ట్యాంకులు నిర్మించారు. లీకేజీ కావడంతో మళ్లీ మరమ్మతులు చేశారు. ఎల్లంపల్లి జలాశయం నుంచి పైప్‌లైన్ ద్వారా తీసుకొచ్చిన భగీరథ నీటిని పట్టణంలోని జాల గుట్టపైకి ఎక్కించి అక్కడి నుంచి ట్యాంకు ద్వారా పట్టణ ప్రజలకు తాగు నీరు సరఫరా చేయాల్సి ఉంది. మరోపక్క అక్కడక్కడ అంతర్గత పైప్‌లైన్ల లీకేజీలు సమస్యగా మారాయి.

◆ మంచిర్యాల పట్టణ ప్రజలకు ఇప్పటికే 18 ఏళ్ల కిందట ముల్కల్లలో నిర్మించిన మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. అప్పుడు ఆ పథకానికి రూ.29.5 కోట్ల ఖర్చు చేసినా అంతర్గత పైప్‌లైన్ల నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో తరచూ లీకేజీలు అవుతున్నాయి. ఇప్పుడు భగీరథ పథకం పనులు చేపట్టినా కొత్త కాలనీలు, శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించడంలో విఫలమయ్యారు. భగీరథ పథకం కింద 10,500 కొత్త నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నా అందులో సగం నల్లాలకు తాగునీరు సరఫరా చేయడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మరికొన్ని వీధుల్లో కొత్తగా అంతర్గత పైప్‌లైన్లు నిర్మించారు. మరికొన్ని ప్రాంతాల్లో పాత పైప్‌లైన్లకే భగీరథ కనెక్షన్లు ఇచ్చి తాగునీరు సరఫరా చేస్తున్నారు. భగీరథ కొత్త నల్లా కనెక్షన్లు కాకుండా పురపాలక సంఘానికి చెందిన పాత కనెక్షన్లు 14 వేలు ఉన్నాయి. భగీరథ పనుల జాప్యంతో ఇప్పటికీ మున్సిపల్ పాత పంప్‌హౌజ్‌పై ఆధారపడే తాగునీరు సరఫరా చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మిషన్ భగీరథ పనులను త్వరగా నాణ్యతగా పూర్తి చేసి శుద్ధి చేసిన తాగు నీరు అందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


మంచిర్యాలలోని సున్నంబట్టివాడలో కొత్తగా నిర్మించిన భగీరథ ట్యాంకుకు సిమెంట్‌తో చేసిన మరమ్మతులు


వేములబస్తీలో కొత్త ట్యాంకుకు చేసిన మరమ్మతులు

తుది దశకు పనులు..

- మధుకర్, ప్రజారోగ్య శాఖ డీఈ, మంచిర్యాల

మంచిర్యాలలో మిషన్ భగీరథ నిర్మాణం పనులు తుది దశకు చేరుకున్నాయి. ట్యాంకులు, అంతర్గత పైప్‌లైన్ల లీకేజీలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తున్నాం. పైప్‌లైన్ల నిర్మాణం పూర్తయినా ప్రాంతాలకు ట్రయల్ రన్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నాం. అక్కడక్కడ పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేస్తున్నాం. కొత్త ట్యాంకులు నిర్మించినప్పుడు చిన్నచిన్న లీకేజీలు అవుతాయి. వాటిని మరోసారి పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.

వీధుల్లో తిరుగుతూ.. సమస్యలు తెలుసుకుంటూ

చెన్నూరు, న్యూస్‌టుడే : చెన్నూరు పట్టణంలోని పలు వీధుల్లో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మార్నింగ్‌వాక్ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పలు వీధులకు నడుచుకుంటూ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు స్థానికులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ నాయకుడు పెండ్యాల శ్రీకాంత్ తండ్రి ఇటీవల మృతి చెందగా అతడి ఇంటికి వెళ్లి శ్రీకాంత్‌ను పరామర్శించారు.


మార్నింగ్ వాక్ చేస్తూ స్థానికులను పలకరిస్తున్న ఎమ్మెల్యే వివేక్


మొన్నటి వరకు ఈ దారి కనిపించేది కాదు.. ప్రస్తుతం ఇలా విశాలంగా మారింది


వేంకటేశ్వర థియేటర్ వెళ్లే దారి ఇలా..


నిత్యం రద్దీగా కనిపించే చికెన్ విక్రయ కేంద్రాల ప్రాంతం ప్రస్తుతం ఇలా..


పోలీస్ స్టేషన్ నుంచి మార్కెట్‌రోడ్‌కు వెళ్లే దారి ఇలా విశాలంగా..

మార్కెట్ దారులు.. విశాలంగా మారుతున్నాయి చూడు

ఏళ్ల తరబడి నెలకొన్న సమస్య పక్షం రోజుల్లో పరిష్కారమైంది. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు వ్యాపారస్థులతో సంప్రదింపులు జరపడంతో సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ప్రస్తుతం మార్కెట్ దారులన్నీ విశాలంగా మారుతున్నాయి. ఇంకా మరమ్మతులు కొనసాగుతుండటంతో మరికొన్ని రోజుల్లో మరింత సుందరంగా మారేందుకు అవకాశం కనిపిస్తోంది. దీనికి తోడు కాలువలు, విద్యుత్తు సరఫరాను భూగర్భం నుంచే ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. రానున్న రోజుల్లో ఆయా దారుల్లో గతంలో ఎదుర్కొన్న కష్టాలన్నీ తీరేలా ఉన్నాయి. ఈ పనులు చేపట్టడం, దారులు విశాలంగా మారడంపై పట్టణ ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ

రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు ఇచ్చిన రైతు భరోసా, రైతు రుణమాఫీ హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్మరించారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. అన్నదాతలకు రైతు భరోసా ఇచ్చి, పెండింగ్‌లోని రుణమాఫీని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మంచిర్యాలలోని జాతీయ రహదారిపై భారాస నాయకులతో కలిసి రాస్తారోకో చేశారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఆందోళన విరమింపజేశారు. దివాకర్‌రావు మాట్లాడుతూ వర్షాకాలం సాగు చేసిన రైతులకు ఇప్పటికీ రైతు భరోసా డబ్బులు ఇవ్వలేదన్నారు. రైతులను మోసం చేసిన ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఆరు గ్యారంటీలను ఇస్తామని చెప్పి ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ ప్రభాకర్, భారాస నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, అంకం నరేశ్, రవీందర్‌రెడ్డి, తాజొద్దీన్, గొర్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకోలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, నాయకులు

ఆర్థిక అవగాహన.. మనుగడకు ప్రాధాన్యత

● సింగరేణి స్థితిగతులపై ఉద్యోగులతో సమావేశాలు

'సింగరేణి భవిష్యత్తు ఉద్యోగుల చేతుల్లోనే ఉంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సంస్థ మనుగడ సాధించాలంటే ఉద్యోగులు మరింత కష్టపడుతూ నిబద్ధతతో పని చేయాలి. కంపెనీని కాపాడుకోవాల్సిన బాధ్యత మీరే తీసుకోవాలి. యాజమాన్యం గనులపై భోజనాలు ఏర్పాటు చేసి సంస్థ స్థితిగతులపై ఉద్యోగులకు అవగాహన కల్పించాలి'.

- ఇటీవల లాభాల వాటా చెక్కుల పంపిణీలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలివీ.


న్యూస్‌టుడే, నస్పూర్

ప్రతి ఏటా రికార్డు స్థాయిలో లాభాలు సాధిస్తూ దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రథమ స్థానంలో నిలుస్తోంది సింగరేణి. ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగానే ఉన్నప్పటికీ బొగ్గు నిల్వలు తగ్గుతుండటం, భూగర్భ గనుల మూత, బొగ్గు ఉత్పత్తిలో ప్రైవేటీకరణ రాబోయే రోజుల్లో సంస్థ, ఉద్యోగుల భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఉపముఖ్యమంత్రి సూచన మేరకు యాజమాన్యం గనులపై భోజనాలతోపాటు 'మల్టీ డిపార్టుమెంటల్ సమావేశాలు' నిర్వహిస్తూ ఉద్యోగులకు కంపెనీ ఆర్థిక పరిస్థితులపై అవగాహన కల్పిస్తోంది.



ఉత్పత్తి వ్యయం తగ్గించేలా..

భూగర్భ, ఉపరితల గనుల్లో బొగ్గు వెలికితీసేందుకు ఎక్కువ మొత్తాన్ని వెచ్చించి భారీ యంత్రాలు కొనుగోలు చేస్తోంది. మానవ వనరులతోపాటు యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయి. భూగర్భ గనుల్లో టన్ను బొగ్గు వెలికి తీసేందుకు సుమారు రూ.9 వేలు, ఉపరితల గనుల్లో సుమారు రూ.5 వేలు ఖర్చయితే ప్రైవేట్ వ్యక్తుల ద్వారా సుమారు రూ.1500 మాత్రమే ఖర్చు అవుతుందని అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. శాశ్వత ఉద్యోగుల జీతాలతో పోలిస్తే గుత్తేదారు సంస్థలు ఒప్పంద కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తుండటం ప్రధాన కారణం. గనుల్లో ఉత్పత్తి వ్యయాన్ని, వృథా ఖర్చులు తగ్గించేందుకు ఉద్యోగులకు అవగాహన ఉండాలి. భారీ యంత్రాలు రోజుల తరబడి మరమ్మతులకు గురికాకుండా విడి భాగాలు ఎప్పటికప్పుడూ అందుబాటులో ఉంచుతూ వాటి పని వినియోగ గంటలు పెంచాలి.



ఆందోళన కలిగిస్తున్న గైర్హాజరు

గనుల్లో ఉద్యోగుల గైర్హాజరు పెరుగుతుండటం బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది. సంవత్సరానికి 100 మస్టర్లు నిండని వారిలో యువ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారు. ఉన్నత విద్యను అభ్యసించి సంస్థలో చేరుతున్న వారికి కష్టమైన పనులు అలవాటు లేక విధులకు దూరంగా ఉంటున్నారు. కొందరూ తమ పలుకుబడితో ఉపరితల పనుల కోసం పైరవీలు చేస్తున్నారు. దీంతో కీలకమైన కోల్‌కట్టర్, సపోర్టుమెన్, ట్రామర్, లైన్‌మెన్ క్యాటగిరి పనులు నిర్వహించే ఉద్యోగుల కొరత ఏర్పడుతోంది. దీన్ని అధిగమించేందుకు కొత్తగా వస్తున్న ఉద్యోగులు తప్పకుండా అయిదేళ్లు భూగర్భ గనుల్లో పని చేయాలి అనే నిబంధన తీసుకొచ్చేందుకు యాజమాన్యం ఆలోచన చేస్తోంది.

త్యాగాల గురుతులు.. సేవల్లో ఘనులు!

● నేడు పోలీసు అమర వీరుల సంస్మరణ దినం

ఎక్కడ ఏ చిన్న గొడవ జరిగినా, శాంతిభద్రతలకు ఏ మాత్రం విఘాతం కలిగించే ఘటనలు జరిగినా ముందుగా మనకు గుర్తుకొచ్చేది పోలీసులే. సమాచారం ఇవ్వగానే వచ్చేస్తారు. సమాజ హితమే పరమావధిగా నిరంతరాయంగా విరామం లేకుండా 24 గంటల పాటు విధులు నిర్వహిస్తారు. ఇలా విధుల నిర్వహణలో సంఘవిద్రోహ శక్తులను, మావోయిస్టులను అరికట్టడంలో 1981 నుంచి 1995 వరకు ఉమ్మడి జిల్లాలో 50 మంది పోలీసులు అమరులయ్యారు. వారి త్యాగాలకు గుర్తుగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో స్మారక నిర్మాణాలను నిర్మించి ఏటా అక్టోబరు 21న 'పోలీసు అమర వీరుల సంస్మరణ దినం' పాటిస్తూ నివాళులర్పిస్తున్నారు. వారం పాటు రక్తదానం, ఇతర సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

-న్యూస్‌టుడే, ఆదిలాబాద్ నేర విభాగం

ఆలంపల్లి కాంప్లెక్స్



కడెం మండలం ఆలంపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసుల మధ్య 1987లో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు ఎస్సైలు, 11 మంది పోలీసులు తమ ప్రాణాలను అర్పించారు. వీరి జ్ఞాపకార్థం పోలీసు హెడ్‌క్వార్టర్‌లో 'ఆలంపల్లి కాంప్లెక్స్' పేరుతో మూడంతస్తుల భవనం నిర్మించారు.

కోట్యానాయక్ ఉద్యానవనం



ఉట్నూర్ ఎస్సైగా ఉన్న కోట్యానాయక్, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు 1991లో మావోయిస్టులు కొమ్ముగూడెం వెళ్లే దారిలో అమర్చిన మందుపాతరకు బలయ్యారు. ఇందుకు గుర్తుగా కోట్యానాయక్ స్మారకార్థం పిల్లల ఉద్యానవనం ఏర్పాటు చేశారు.

వ్యాయామశాల

బెల్లంపల్లి, మంచిర్యాల ప్రాంతాల్లో మావోయిస్టుల కార్యకలాపాల సమాచారం చేరవేస్తున్నారని కానిస్టేబుళ్లు శేష, సంజీవ్‌లను 2000 సంవత్సరంలో తుపాకులతో కాల్చగా వారిద్దరు మృతి చెందారు. ఈ ఇద్దరి పేరిట వ్యాయామశాలలను నిర్మించారు.

చక్రపాణి సమావేశ మందిరం

మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ వద్ద 1993లో మావోయిస్టులు ఒక ఇంట్లో దాక్కోగా శ్రీరాంపూర్ సీఐగా పని చేస్తున్న చక్రపాణి వెళ్లగా సీఐతో పాటు కానిస్టేబుల్ అశోక్‌పై కాల్పులు జరిపారు. ఆయన పేరుతో 'చక్రపాణి మెమోరియల్ హాలు' నిర్మించారు.

స్మారక స్తూపం

వివిధ సందర్భాల్లో మావోయిస్టుల చేతుల్లో మృతి చెందిన పోలీసుల స్మారకార్థం అమరుల చిత్రాలను వేయించి ఏర్పాటు చేశారు. ఇక్కడే ఏటా అమరులకు నివాళులు అర్పిస్తుంటారు.



అమర వీరుల కాలనీ



విధి నిర్వహణలో ప్రాణ త్యాగాలు చేసిన పోలీసు కుటుంబాలకు ఆదిలాబాద్‌లో ప్రత్యేక కాలనీని రూ. కోటి వ్యయం చేసి నిర్మించారు. 48 కుటుంబాలకు నివాసాలను నిర్మించారు. పోలీసు అమరవీరుల కాలనీగా నామకరణం చేసిన ఈ కాలనీ రాష్ట్రంలోనే మొదటిది.



గాదిగూడలో వైద్య శిబిరంలో ఔషధాలను అందజేస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌస్‌ఆలం

ఉమ్మడి జిల్లాలో 50 మంది

ఉమ్మడి జిల్లాలో మొత్తం 50 మంది పోలీసులు సంఘ విద్రోహుల చేతిలో అమరులయ్యారు. వీరిలో 48 మందిని మావోయిస్టులు హతమార్చారు. మరో ఇద్దరిని సంఘ విద్రోహశక్తులు హత్య చేశాయి. వీరిలో ఒక సీఐ, ఏడుగురు ఎస్సైలు, ఒక ఏఎస్సై, 12 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 29 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు.

సామాజిక కార్యక్రమాలు ఇవే..

- తిర్యాణి మండలంలో ఆదివాసీలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చడానికి రోంపల్లి-గుండాల, భీంపూర్-మంగి, కడెం మండలం నవాబ్‌పేట-గంగాపూర్ వరకు మట్టి రహదారులు నిర్మించారు.
- సిరికొండ మండలంలో పాలవాగుపై వంతెన నిర్మాణం చేపట్టారు.
- బజార్‌హత్నూర్ మండలం డెడ్రాలో శుద్ధ జల ప్లాంటును ఏర్పాటు చేయించి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించారు.
- గుడిహత్నూర్‌లో ఇటీవల వాలీబాల్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.
- గాదిగూడ, నార్నూర్ మండలాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించారు
- ఉట్నూర్, నార్నూర్ మండలాల్లో ఆదివాసీలకు 1000 దుప్పట్లు పంపిణీ చేశారు.
- ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో ఆదివాసీ యువకులకు క్రికెట్, వాలీబాల్ కిట్లను అందించారు
- ఏటా వర్షాకాలంలో వాగుల వద్ద వరద ఉద్ధృతి కారణంగా ప్రాణనష్టం జరగకుండా పోలీసు బలగాలను మోహరిస్తున్నారు.
- ఇటీవల విపత్తు నిర్వహణ జిల్లా బృందాలను రెండింటిని అందుబాటులోకి తెచ్చారు. వీరి వద్ద ప్రమాద సమయంలో ప్రజలను కాపాడటానికి అవసరమైన అన్ని పరికరాలు, బోట్లు ఉంచారు
- రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. పేదలకు సరకులు పంపిణీ చేస్తున్నారు.

రైలు ఢీకొని 180 జీవాల మృత్యువాత



పట్టాలకు ఒకవైపు చెల్లాచెదురైన జీవాల కళేబరాలు

సిర్పూర్(టి), కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) మండలం ఆరెగూడ సమీపంలో శనివారం రాత్రి రైలు ఢీకొని 180 జీవాలు మృత్యువాతపడ్డాయి. ఇందులో 170 గొర్రెలు, 10 మేకలు ఉన్నాయి. కౌటాల మండలం సిర్సా గ్రామానికి చెందిన జె.భీమయ్యకు 190 జీవాలు ఉన్నాయి. వాటిని మేపేందుకు నిత్యం ఇతర ప్రాంతాలకు సంచరిస్తుంటాడు. ప్రస్తుతం ఆరెగూడ సమీప కాగజ్‌నగర్-బల్లార్షా రైల్వే లైన్ వద్ద తాత్కాలికంగా స్థావరం ఏర్పాటుచేసుకున్నాడు. ఈక్రమంలో శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో వర్షం ప్రారంభమైంది. జీవాల మంద వద్ద కాపలా ఉన్న అతను తలదాచుకునేందుకు సమీపంలోని పాకలోకి వెళ్లి నిద్రపోయాడు. వర్షం ఎక్కువ కావడంతో ఆ జీవాలు చెట్ల కిందకు చేరుకునేందుకు పట్టాలు దాటుతున్న క్రమంలో ఒక్కసారిగా రైలు రావడంతో కిందపడి మృతిచెందాయి. తెల్లవారు జామున మంద కనిపించకపోవడంతో బాధితుడు గాలించగా.. సమీప రైలు పట్టాల వద్ద విగత జీవులుగా కనిపించాయి. 10 మేకలు మాత్రమే బతికాయని, తన జీవానాధారం పోయిందని కన్నీటిపర్యంతమయ్యాడు. దాదాపు రూ.25 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

నగదుతో సరిహద్దు దాటుతున్నారా.. జాగ్రత్త!

● మహారాష్ట్రలో ఎన్నికల కోడ్ అమలు

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 15న షెడ్యూల్ విడుదల చేయడంతో తెలంగాణ రాష్ట్ర సరిహద్దున ఉన్న మహారాష్ట్రలో ఎన్నికల నియమావళి తక్షణమే అమల్లోకి వచ్చింది. దీంతో ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘం చర్యలను ప్రారంభించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దున అవతలి వైపు మహారాష్ట్ర పోలీసులు ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. తెలంగాణకు సరిహద్దున ఉన్న మంచిర్యాల, కుమురంభీం, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి మహారాష్ట్రలోని అనేక పట్టణాలకు, పల్లెల మధ్య నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ద్విచక్ర వాహనాలపై అవసర నిమిత్తం వెళ్లి వస్తుంటారు. మహారాష్ట్రలోని చంద్రపూర్, నాందేడ్, యావత్మాల్, గడ్చిరోలి జిల్లాలు తెలంగాణ రాష్ట్ర సరిహద్దున ఉన్నాయి. మహారాష్ట్రలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో అవసరం నిమిత్తం నగదు తీసుకెళ్లేవారు ఎంతో జాగ్రత్త తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో చిన్న పొరపాటు చేసినా ఇబ్బందులు తప్పవు..



మహారాష్ట్రలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో తెలంగాణ సరిహద్దున కోటపల్లి మండలంలోని రాపన్‌పల్లి(ప్రాణహిత వంతెన) వద్ద తనిఖీలు చేస్తున్న కోటపల్లి పోలీసులు

రూ.50 వేలకు మించితే ఆధారాలు తప్పనిసరి..

ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఎవరైనా వెంట నగదు తీసుకెళ్లేటపుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే అందుకు సంబంధించిన ఆధారాలు వెంట ఉంచుకోవాలి. రసీదులను తనిఖీ చేసే అధికారులకు చూపాలి. లేనిపక్షంలో సీజ్ చేస్తారు. అదేవిధంగా నగదుతో పాటు బంగారం, వెండి కొనుగోలు చేసినా.. రసీదు తప్పనిసరిగా వెంట పెట్టుకోవాలి. వస్తువుల కొనుగోలు, అమ్మకాలతో పాటు బిల్లుల చెల్లింపులు చేసినా రసీదు తప్పనిసరిగా కలిగిఉండాలి. నగదు వెంట తీసుకెళ్లేటపుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించి ఆధారాలను వెంట పెట్టుకోవాలని ఎన్నికల అధికారులు ప్రకటనల ద్వారా సూచిస్తున్నారు. తనిఖీలో నగదు దొరికితే.. ఆధారాలు చూపించిన తిరిగి పొందాల్సి ఉంటుంది. మహారాష్ట్రలోని అనేక ప్రాంతాల ప్రజలు వైద్యం, వ్యాపారం, ఇతర అవసరాలను సరిహద్దున ఉన్న తెలంగాణలోని వివిధ పట్టణాలకు వస్తుంటారు. జిల్లా వాసులు మహారాష్ట్రకు వెళుతుంటారు.

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న పట్టణాలు, ప్రాంతాలు..

- నిర్మల్ జిల్లాలోని ముథోల్, బాసర, కుంటాల, సారంగాపూర్, కుభీర్ మండలాలు మహారాష్ట్రకు ఆనుకొని ఉన్నాయి.
- మహారాష్ట్ర.. నాందేడ్ జిల్లాలోని ధర్మాబాద్ మహోర్ ఉమ్రి, కిన్వాట్, ముత్తేడ్, లోహా.
- కుమురంభీం జిల్లాలోని బెజ్జూరు, కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్(టి), వాంకిడి, కెరమెరి, జైనూర్
- మహారాష్ట్ర చంద్రపూర్, గడ్చిరల్లి జిల్లాల్లోని జమితి, రాజురా, లక్కర్‌కోడ్, కోడ్సా, అహేరి
- మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి, చెన్నూరు, వేమనపల్లి మండలాలు మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్నాయి.
- మహారాష్ట్ర.. గడ్చిరోలి జిల్లాలోని సిరోంచ, అంకిసా, ఆసరల్లి, మొట్లగూడెం, తదితర ప్రాంతాలు తెలంగాణకు ఆనుకొని ఉన్నాయి.
- ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్, జైనథ్, బేల, తాంసి, తలమడుగు...
- మహారాష్ట్రలోని యవత్మాల్ నాందేడ్, చంద్రపూర్ జిల్లాల్లోని మాండివీ, బోరి, పిప్పల్‌కుట్టి, పాండ్రకవడ ప్రాంతాలు..

దేవత పూజలకు గానుగ నూనె సిద్ధం



గానుగలో నువ్వుల నూనెను తీసేందుకు కర్రను తిప్పుతున్న యువకులు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ఆదివాసీ గిరిజనులు మరో వారం రోజుల్లో దండారీ ఉత్సవాలను ప్రారంభిస్తారు. ఉపవాస దీక్షతో ఆదివారం ఇంద్రవెల్లి మండలం పొల్లుగూడలో మహాలక్ష్మీ దేవత పూజల కోసం గూడెంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గానుగ ద్వారా నువ్వుల నూనెను తీస్తున్నారు. ఆదివాసీ గోండు, కొలాం గిరిజనుల దేవతలకు పూజల సందర్భంగా ప్రత్యేకంగా గానుగలో తీసిన నువ్వుల నూనెతోనే దీపం వెలిగించి దేవతలకు మొక్కుతామని, దీపావళి పండగ సందర్భంగా ఇంటి ముందర ఏర్పాటు చేసే దీపాలను సైతం నువ్వుల నూనెతోనే వెలిగిస్తామని ఆదివాసీ మహిళలు మెస్రం లక్ష్మీ, సీడాం జంగుబాయి తదితరులు తెలిపారు.

శ్వాస అందించి.. ప్రాణాన్ని రక్షించి!

ఇచ్చోడ, న్యూస్‌టుడే : 108 సిబ్బంది సమయానికి చేరుకొని పసిబిడ్డ ప్రాణాన్ని రక్షించిన ఘటన ఇచ్చోడ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలం కోలాంగూడకు చెందిన గర్భిణి షబానాకు శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో పురిటి నొప్పులు మొదలయ్యాయి. 108ను సంప్రదించడంతో సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. నొప్పులు తీవ్ర కావడంతో ప్రసవం చేశారు. శిశువు ఏడవకపోవడం, శ్వాస తీసుకోకపోవడంతో ఈఎంటీ రాకేష్ కృత్రిమ శ్వాస అందించి ప్రాణం పోశారు. పైలెట్ అలీం తోడ్పాటుతో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పాప ఆరోగ్యంగా ఉందని, తండ్రి షేక్ లదీమ్ తెలిపారు.



శిశువు

అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కుంకుమపూజ, మహాహారతి తదితర పూజలు నిర్వహించారు.

● అమ్మవారిని ఆదివారం వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర శిక్షణ కళాశాల ఎస్పీ బ్రజేశ్‌మిశ్రా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



పూజలు చేస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు

సరదా ఆట.. ఆరోగ్యబాట



ఆర్కేపీ తారకరామ కాలనీలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌లో ఆడుతున్న చిన్నారులు

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : ఆదివారం వచ్చిందంటే చాలు చిన్నారులకు పట్టరాని సంతోషం. పుస్తకాలను పక్కన పెట్టి వారికి నచ్చిన ఆటలు ఆడుతూ ఆనంద పడుతుంటారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని క్యాతనపల్లి పుర పరిధిలోని జిమ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గతంలో అయిదు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసినప్పటికీ అన్ని వార్డుల్లో ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి డిమాండ్ రావడంతో ప్రతి చోట ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. పలు వార్డుల్లో నిర్మాణ పనులు కొనసాగుతుండగానే చిన్నారులు ఓపెన్ జిమ్‌లో ఇలా ఆనందంగా గడుపుతున్నారు. చిన్నారుల ఆటమైదానం పనులు కూడా త్వరగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

23న ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 కబడ్డీ పోటీలు ఈ నెల 23న బెల్లంపల్లి సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల(కాసిపేట)లో నిర్వహించనున్నట్లు డీఐఈఓ అంజయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.బాబురావు తెలిపారు. బాలురకు కాసిపేట పాఠశాలలో, బాలికలకు సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో ఎంపిక పోటీలు ఉంటాయని చెప్పారు. పోటీలకు ఇంటర్ చదువుతున్న 19 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ప్రతి కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని చెప్పారు. విద్యార్థులు బోనాఫైడ్, ఆధార్ కార్డులను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాకు 18 మంది పశువైద్యాధికారులు

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో పశుసంవర్ధక శాఖ పరిధిలో ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న పశు వైద్యాధికారుల పోస్టులు భర్తీ అయ్యాయి. ఇటీవల ప్రభుత్వం నియామక ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు జిల్లాకు 18 మందిని కేటాయించింది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో వారు విధుల్లో చేరారు. కొత్తగా పశువైద్యాధికారులుగా బాధ్యతలు తీసుకున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి.

పేరు	పశువైద్యశాల
లావణ్య	తలమడుగు
విజయ్‌కుమార్	ముత్నూర్
శ్రీకాంత్	గుడిహత్నూర్
వంశీకిరణ్	శాంతాపూర్
దీపరతన్	ల్యాబ్, ఆదిలాబాద్
మహమ్మద్ అబ్దుల్	పొన్కల్
సంపత్	నెన్నెల
పరిమళ	కాగజ్‌నగర్
రమేశ్	దహెగాం
సౌందర్య	కడెం
ప్రియాంక	కుంటాల
సంధ్యారాణి	రేవోజీపేట
శరణ్య	ఇందాని
అంజలి	ముత్యంపేట
సురేశ్	కెరమెరి
కార్తీక్	రెబ్బెన
భవిత	సిర్పూరు(టి)
రత్న సుప్రియ	వేమనపల్లి

అండగా ఉంటూ.. ఆర్థికంగా చేయూతనిస్తూ..

● బాధిత కుటుంబాలకు స్నేహితుల భరోసా

లోకేశ్వరం, న్యూస్‌టుడే: పదోతరగతి పూర్తి కాగానే మిత్రులలో దాదాపు సగానికి పైగా విడిపోతారు. ఇందులో కొందరు ఆర్థిక పరిస్థితులతో చదువు మానేసి కుటుంబ పోషణలో భాగమవుతుంటే మరికొందరు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడుతుంటారు. ఇలా మూడు దశాబ్దాల కిందట పదో తరగతి పూర్తి చేసుకుని ఉద్యోగంలో స్థిరపడ్డ కొందరు ఆనాడు తమతో చదువుకున్న స్నేహితులలో ఎవరికి కష్టమొచ్చినా మేమున్నామంటూ భరోసానిస్తున్నారు. లోకేశ్వరం మండలం పంచగుడి, ధర్మోర గ్రామాలకు చెందిన కొందరు యువకులు హెల్పింగ్ హ్యాండ్స్ పేరిట గ్రూపు ఏర్పాటు చేసుకుని స్నేహితుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. 2014లో సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఎంపికై తెలుగు రాష్ట్రాల్లో కొలువులో ఉన్న కొందరు పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్‌గా ఏర్పడి తమతో శిక్షణ పొందిన ఎస్సై కుటుంబాల్లో ఎవరికి ఆపదొచ్చినా వారికి ఆర్థికంగా చేయూత అందిస్తున్నారు. ప్రస్తుతం ఆత్మీయ సమ్మేళనాలతోనే సరిపెట్టుకుంటున్న పూర్వ విద్యార్థులు కూడా ఈ దిశగా ఆలోచిస్తే ఎన్నో కుటుంబాలను ఆదుకున్న వారవుతారు.

రక్తబంధం కాదు.. రక్షక బంధంతో...

2014 ఎస్సై బ్యాచ్‌లో 1100 మంది శిక్షణ పొందగా, 746 మంది సభ్యులు పోలీసు సోషల్ వెల్ఫేర్‌లో సభ్యత్వం తీసుకున్నారు. వీరిప్పుడు తమతో పాటు శిక్షణ పూర్తి చేసుకుని ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏ ఒక్క కుటుంబానికి ఆపదొచ్చినా పలకరిస్తూ ఆర్థిక సాయం అందజేస్తున్నారు. వీరు ఇప్పటి వరకు మరణించిన, క్షతగాత్రులైన వారి కుటుంబాలకు రూ.82.50 లక్షల ఆర్థిక సాయం అందజేసి తమది రక్తసంబంధం కాకపోయినా రక్షక బంధాన్ని చూపామంటున్నారు.

మూడు దశాబ్దాలు దాటినా...

బెల్లంపల్లి గురుకులం 1989-90 బ్యాచ్ పదో తరగతి మిత్రులు నేటికీ అప్పుడప్పుడు కలుసుకుంటూ కష్టసుఖాలు పంచుకుంటున్నారు. వీరితో పాటు పదో తరగతి పూర్తి చేసుకున్న లోకేశ్వరం మండలం పోట్‌పెల్లి(బి) వాసి సాయన్న 2022లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన మిత్రులు సాయన్న తల్లిదండ్రుల దీనస్థితిని చూసి చలించిపోయారు. తలా కొంత పోగు చేసి రూ.53వేల ఆర్థిక సాయం అందజేశారు. మంచిర్యాలకు చెందిన మరో మిత్రుడు కమలాకర్ గుండెపోటుతో నాలుగు మాసాల కిందట మరణించారు. ఆయనకు ఇద్దరు పిల్లలున్నారు. వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న మిత్రులు తలా కొంత పోగు చేసి రూ.1.75 లక్షలను ఆ పిల్లలకు అందజేశారు.



పంచగుడిలో శ్రీకాంత్ తండ్రి గంగాధర్‌కు నగదు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

యువకులంతా ఒక్కటై..

పంచగుడి, ధర్మోర గ్రామాల యువకులు 50 మంది తమలో ఏ ఒక్కరికి కష్టమొచ్చినా దాన్ని కొంతవరకైనా పూడ్చాలని హెల్పింగ్ హ్యాండ్స్ అనే గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో ఒకరిగా ఉన్న పంచగుడి వాసి సలీం అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబానికి రూ.30 వేలు, వారం రోజుల కిందట అదే గ్రామవాసి శ్రీకాంత్ గుండెపోటుతో మరణించగా ఆయన తండ్రి గంగాధర్‌కు రూ.75 వేల ఆర్థిక సహాయం చేశారు.



ఉద్యోగులతో కలిసి నృత్యం చేస్తున్న ఉమ్మడి జిల్లా తపాలా పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్ధార్థ

సందడి చేసి.. ఉత్సాహపరిచి..

ఉమ్మడి జిల్లా తపాలా పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్ధార్థ స్టెప్పులు వేసి సహ ఉద్యోగులను ఉత్సాహపరిచారు. ఆదివారం ఆదిలాబాద్ గాయత్రి గార్డెన్‌లో తపాలా శాఖ ఆదిలాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో ఫెస్ట్-ఓ-పోస్ట్ సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. తపాలా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు నృత్యాలు చేసి అలరించారు. పాటలు ఆలపించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఉప పర్యవేక్షకుడు లవకుశ్, ఐపీవోలు ఎన్.రాజు, దిలీప్, కల్యాణ్, ఐపీపీబీ మేనేజర్ రాజేశ్, ఎఫ్ఎన్‌పీవో ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, మహేశ్, ఆలిండియా జీడీఎస్ అధ్యక్షుడు వెంకట్‌రావు, ఆదిలాబాద్ డివిజన్ కార్యదర్శి గట్టు శ్రీనివాస్, తపాలా సిబ్బంది ఉన్నారు.



నృత్యం చేస్తున్న యువతి

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం

మేమున్నాం.. మీకు తోడుగా..

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369
(10 AM TO 1 PM)

ఏసీసీ, న్యూస్‌టుడే:

? మంచిర్యాల పట్టణంలోని మేదరివాడ బైపాస్ రోడ్డు నుంచి లక్ష్మీటాకీస్ చౌరస్తా వరకు డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన స్తంభాలకు వీధి దీపాలు వెలగడం లేదు. - **కలిపె శ్రీనివాస్, మంచిర్యాల, బైపాస్‌రోడ్డు**

✔ సమస్యను పరిశీలించి ఆయా చోట్ల రెండు రోజుల్లో విద్యుత్తు దీపాలు వెలిగేలా ఏర్పాట్లు చేయిస్తాం.
- **మసూద్ అలీ, మున్సిపల్ ఇంజినీరు, మంచిర్యాల**

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:

? మంచిర్యాలలోని వికాస్‌నగర్, రోడ్డు నెం.3లో సిమెంట్ రహదారి నిర్మించకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బంది అవుతుంది. మురుగు కాలువ నాణ్యత పాటించకుండా కింది భాగంలో ఎత్తు వంపులుగా గతంలో నిర్మించడంతో మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తుంది.
- **రాజేశం, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి, వికాస్‌నగర్, మంచిర్యాల**

✔ రెండు రోజుల్లో వికాస్‌నగర్‌లో రహదారి, కాలువ సమస్యను పరిశీలించి సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తాను.
-**మసూద్ అలీ, మున్సిపల్ ఇంజినీరు, మంచిర్యాల**

చెన్నూరు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని గ్రంథాలయ సమీపంలోని బ్రాహ్మణ వీధిలో రహదారికి ఇరువైపుల పిచ్చిచెట్లు పెరిగి వీధిలోకి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంటుంది. - **పులి రామన్న, స్థానికుడు**

✔ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.
- **రాజ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, చెన్నూరు**

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : క్యాతనపల్లి పురపరిధిలోని కుర్మపల్లి ఫ్లైఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సింగరేణి కార్మికుడు నాగుల సంతోష్(24) ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆర్కేపీ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.



సంతోష్

ఆయన కథనం మేరకు... మందమర్రి పట్టణం రాజీవ్ నగర్‌కు చెందిన సంతోష్ ఆర్కే7 గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఆర్కే7 గనిలో విధులు నిర్వహించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. కుర్మపల్లి ఫ్లైఓవర్‌పై ముందు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తలకు శిరస్త్రాణం ధరించి ఉంటే బతికేవాడన్నారు.

కారు ఢీకొని కూలీ..

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రి సమీపంలోని ఓసీ పక్కన గల రహదారిపై జరిగిన ప్రమాదంలో శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన రాజలింగు (52) అనే కూలీ మృతి చెందినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కట్టెలు కొట్టుకుంటూ జీవనం సాగించే రాజలింగు ఆదివారం కట్టెలు కొట్టి సైకిల్‌పై శ్రీరాంపూర్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనక నుంచి వచ్చిన ఓ కారు ఢీ కొట్టింది. దీంతో ఆయనకు గాయాలు కాగా మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డట్లు తెలిపారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుప్తనిధుల తవ్వకాలు చేస్తున్న వ్యక్తుల అరెస్ట్

జైపూర్, న్యూస్‌టుడే : ఇందారం గ్రామంలో ఓ ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన హోటల్ నిర్వాహకుడు సాంబయ్య అనే వ్యక్తి ఇంట్లో తవ్వకాలు చేస్తున్న అదే గ్రామానికి చెందిన వెన్న రాజేష్, వెంకటి, కాళ్ల కుమురయ్య, బద్దెల ప్రసాద్, వెన్నకుమార్‌లతో పాటు శ్రీరాంపూర్‌కు చెందిన ఐలయ్య, కొమురంభీం జిల్లా రెబ్బెన మండలం సోనాపూర్‌కు చెందిన కొమురం గంగు, అర్కభీం, శ్రీరాం తిరుపతి, రమేష్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి గడ్డపార, తట్ట, పారలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

నైపుణ్యం ప్రదర్శించి.. బహుమతులు గెలిచి..



బెల్లంపల్లి కృష్ణవేణి పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



రామకృష్ణాపూర్: ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల నిర్వాహకులు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ వినియోగంపై లాభనష్టాలు, విద్యార్థుల సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు పరీక్ష రాశారు. ప్రథమ స్థానంలో వి. ఈశ్వర్, ద్వితీయ స్థానంలో కె.వైష్ణవి, తృతీయ స్థానంలో టి. అక్షర ఠాకూర్ నిలిచారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపల్ రాజా రమేష్ బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు భానేశ్వర్, మనోహర్, హతియా, అంజద్ పాల్గొన్నారు.


రామకృష్ణాపూర్: మందమర్రి సింగరేణి ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు.. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బి.శ్రావ్యశ్రీ(8వ తరగతి) ప్రథమ, వి. జశ్విక్(8వ తరగతి) ద్వితీయ, ఆర్. లాస్యశ్రీ(10వ తరగతి) తృతీయ స్థానంలో నిలిచి ప్రతిభ చాటారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం, శ్రీనివాస్, తిరుపతి, శ్రీవాణి బహుమతులు అందజేసి అభినందించారు.



బెల్లంపల్లి : బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ రమేష్



రామకృష్ణాపూర్ : పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



ప్రహరీ లేని గురుకుల పాఠశాల చుట్టూ పెరిగిన మొక్కలు



గేటు ముందు భాగం

ప్రహరీ లేక ఇక్కట్లు

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: క్యాతనపల్లి పురపరిధి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో సుమారు 524 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. కొన్ని ఏళ్లుగా సింగరేణి అద్దె భవనంలో ఈ పాఠశాలను కొనసాగిస్తున్నారు. పాఠశాల పక్కన నీలగిరి తోట ఉండటంతో పాములు సంచరిస్తున్నాయని విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపల్ ప్రేమరాణిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఇప్పటికే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

వేమనపల్లి, న్యూస్‌టుడే: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని జైపూరు ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం నుంచి నీల్వాయి ఉన్నత పాఠశాల మైదానంలో ఖోఖో పోటీలను ప్రారంభించారు. ఆదివారం విజేతగా గెలుపొందిన నీల్వాయి జట్టు, రెండో విజేతగా గెలుపొందిన రేచిన ఉన్నత పాఠశాల జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. ఏసీపీ మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, సెక్రెటరీ పనిరాజా, మాజీ జడ్పీటీసీ సభ్యుడు సంతోశ్‌కుమార్, చెన్నూరు గ్రామీణ సీఐ సుధాకర్, తహసీల్దార్ రమేశ్, ఎస్సై శ్యాంపటేల్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

దాడులతో భయానక వాతావరణం

★ మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో దాడులు, దౌర్జన్యాలు చేయిస్తూ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రజల్లో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. ఆదివారం మంచిర్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వినాయక చవితి, బతుకమ్మ రోజుల్లో అనేక మందిపై దాడులు చేయించి వారిపైనే కేసులు పెట్టించారని ఆరోపించారు. భారాసకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్‌పై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై పోలీసులు చర్యలు తీసుకోకుండా ఆసుపత్రిల్లో చికిత్స పొందుతున్న అతడినే పోలీసులు దౌర్జన్యంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. భూవివాదాల్లో తలదూర్చి అనుచరులతో సెటిల్‌మెంట్లు చేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇక్కడి ప్రజల సౌకర్యం కోసం మంచిర్యాల-అంతర్గామ మధ్య గోదావరి నదిపై రహదారి ఎత్తు వంతెన మంజూరు చేయిస్తే దానికి అడ్డుపడి నిర్మించకుండా చేశామని ఆరోపించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్లు రాజయ్య, ప్రభాకర్, భారాస పట్టణాధ్యక్షుడు సత్యం, మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్‌లీడర్ నరేష్, నాయకులు విజిత్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, చిత్రంలో నాయకులు

అక్రమంగా దాడి చేశారు..

దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై పోలీసులు చర్యలు తీసుకోకుండా తన భర్తపైనే అక్రమంగా కేసు నమోదు చేయించారని మాజీ ఎంపీపీ స్వర్ణలత ఆరోపించారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తన భర్తపై దాడి చేసిన వ్యక్తులు తలకు, కాళ్లకు పట్టీలు కట్టుకుని గాయాలైనట్లు ఆసుపత్రిలో చేరారని ఆరోపించారు.

పాదయాత్ర విజయవంతం చేయాలి



మంచిర్యాలలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాల సంఘం నాయకులు

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 25న భద్రాచలం నుంచి ప్రారంభమయ్యే మాలల పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్ కోరారు. ఇందుకు సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆదివారం మంచిర్యాలలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో జిల్లాలోని మాలలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆ సంఘం జిల్లా ఇన్‌ఛార్జి బైరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలు నిర్వహించాలని డిమాండ్

సింగరేణి సమాచారం

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : సింగరేణిలో ఎన్నికల్లో గెలిచిన గుర్తింపు కార్మిక సంఘంతో యాజమాన్యం నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించాలని సీఐటీయూ ఏరియా బ్రాంచి అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం రామకృష్ణాపూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి పది నెలలు గడుస్తున్నా యాజమాన్యం ఇంత వరకు ఎలాంటి సమావేశం నిర్వహించలేదని మండి పడ్డారు.

ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

జైపూర్, న్యూస్‌టుడే : మండలంలోని స్థానిక యువతకు సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం ద్వారా రానున్న రోజుల్లో మరింత ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేక్ అన్నారు. ఆదివారం పలు గ్రామాల్లో పర్యటించారు. నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభిస్తామన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ విగ్రహ స్థలానికి భూమిపూజ చేశారు. జైపూర్, ఎల్కంటి, పెగడపల్లి, గంగిపల్లి, శెట్‌పల్లి, కుందారం గ్రామంలో రూ.1.27 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

పదోన్నతుల్లో జాప్యం తగదు

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతీ సంవత్సరం జూన్‌లో ప్రకటించాల్సిన పదోన్నతులను ఇప్పటికీ ప్రకటించకపోవడం అన్యాయమని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ యాజమాన్యం చేస్తున్న జాప్యంతో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా వివిధ కేటగిరీల్లో యాక్టింగ్ ప్యానల్ జాబితాను గనులు, విభాగాలపై ప్రచురించి సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, శ్రీకాంత్, రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలి

జన్నారం, న్యూస్‌టుడే: త్వరలో జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఎస్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులను అభ్యర్థిగా నిలబెట్టడానికి సీపీఎస్ నిర్ణయించుకుందని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో పోటీ చేసిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలు ఎన్నికల సమయంలో సీపీఎస్ రద్దు కోసం పోరాడుతామని హామీ ఇచ్చి ఆరేళ్లు పూర్తి కావస్తున్నా ఆ ఊసే ఎత్తలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ పునరుద్ధరణ కోసం పోరాడే వారిని పోటీలో నిలబెట్టి గెలిపించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే వారంతా ఇప్పటికే ఓటరుగా నమోదై ఉన్నప్పటికిని మళ్లీ కొత్తగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు.



వేమనపల్లి బస్టాండు వద్ద..



నెన్నెలలో..



తాండూరు మండల కేంద్రంలో..



చెన్నూరులోని తెలంగాణతల్లి విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న భారాస నాయకులు

భారాస నాయకుల ఆందోళన

జిల్లావ్యాప్తంగా భారాస నాయకులు ఆదివారం ఆందోళన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దీపావళిలోపు రైతు భరోసా కింద ఎకరానికి రూ.7,500 అకౌంట్లో జమ చేయాలని మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య అన్నారు. మండలంలోని కొండపూర్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి రాస్తారోకో చేశారు. తమ ప్రభుత్వ హయాంలో సాగు సమయంలో సాయం అందిస్తే రేవంత్ ప్రభుత్వం పంట చివరి దశకు చేరుకున్నా.. సాయం అందించడం లేదని విమర్శించారు. ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.



కాసిపేట: కొండాపూర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

న్యూస్‌టుడే, బృందం

పీఆర్‌సీ అమలు చేయాలి

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పెండింగ్ డీఏలతోపాటు పీఆర్‌సీ అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి అన్నారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణంలో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. గురుకుల, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేయాలని చెప్పారు. గురుకులాల సమయపాలనలో మార్పులు తేవాలన్నారు. పెండింగ్ బిల్లులను చెల్లించాలని వివరించారు. సభ్యులు కిరణ్, చంద్రమౌళి, దేవదాసు, సంతోష్, రవికుమార్, సంపత్ పాల్గొన్నారు.

రోడ్లపై విక్రయాలొద్దు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో కూరగాయల మార్కెట్‌లో లబ్ధిదారుల స్టాళ్ల ఎంపికకు మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం లక్కీ డ్రా చేపట్టారు. 108 మంది లబ్ధిదారుల పేర్లను, స్టాళ్ల నంబర్లను వేర్వేరు డబ్బాల్లో వేసి లక్కీ డ్రా తీశారు. అంతకుముందు లబ్ధిదారులంతా సమావేశ మందిరానికి వచ్చి కొంతమంది తమ సంఘం నాయకులు రాలేదంటూ వెళ్లిపోయారు. జిల్లా పాలనాధికారి ఆదేశాలతో అధికారులు లక్కీ డ్రా నిర్వహించారు. ఈ నెల 21 నుంచి రోడ్లపై ఎట్టి పరిస్థితుల్లో కూరగాయలు విక్రయించరాదని మున్సిపల్ ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి మున్సిపల్ సిబ్బంది, పోలీసులు మార్కెట్ వద్ద లక్కీ డ్రా వివరాలతో అందుబాటులో ఉంటారని చెప్పారు. రోడ్ల మీద కూరగాయలు విక్రయిస్తే రూ.1000 జరిమానా విధిస్తామన్నారు.

జార్జిరెడ్డి స్ఫూర్తితో పోరాటం

లక్షెట్టిపేట: మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా విద్యార్థుల సమస్యలపై పోరాడిన జార్జిరెడ్డిని ఆదర్శంగా తీసుకుని వసతిగృహ విద్యార్థుల సమస్యలపై పోరాటాలు సాగించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పూర్వ విద్యార్థి నాయకుడు రెడ్డిమల్ల ప్రకాశం సూచించారు. పీడీఎస్‌యూ ఏర్పాటు జరిగి 50 వసంతాలు పూర్తి అవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కార్తిక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్, నాయకులు చరణ్, విజయ్, సాగర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

హాజీపూర్: మండలంలోని గుడిపేట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తిగా స్వల్ప గాయాలయ్యాయి. మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న శ్రీనివాస్‌ను ఎదురుగా లక్షెట్టిపేట నుంచి మంచిర్యాల వైపునకు వస్తున్న ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు గాయాలుకాగా అదే సమయంలో అటుగా వెళ్తున్న హాజీపూర్ ఎస్సై సురేష్ స్పందించి క్షతగాత్రుడిని 108 వాహనంలో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

సంక్షిప్తం

రిజర్వేషన్ల ఎత్తివేతకు కుట్ర

జన్నారం: ఎస్సీ వర్గీకరణ ముసుగులో రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ల రమేశ్ ఆరోపించారు. జన్నారంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. నాయకులు శ్రీకాంత్, భరత్‌కుమార్, గంగాధర్, ప్రభాకర్, మల్లయ్య, నందయ్య పాల్గొన్నారు.

పట్టణ కార్యవర్గం ఎన్నిక

జన్నారం: పద్మశాలీ సంఘం పొనకల్ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల అధ్యక్షుడు చెటుపల్లి గంగయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెటుపల్లి కృష్ణ, ఉపాధ్యక్షుడిగా కందుల రమేష్, ప్రధాన కార్యదర్శిగా అయ్యోరు శ్రీనివాస్, కోశాధికారిగా దోమల భాస్కర్, ప్రచార కార్యదర్శిగా బొద్దుల అంజన్నను ఎన్నుకున్నారు.

రమేశ్ రాఠోడ్ జయంతి

జన్నారం: మండల కేంద్రంలో మాజీ ఎంపీ రమేశ్ రాఠోడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. భాజపా మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, నాయకులు శంకరయ్య, జగన్, గోపాల్, సురేశ్, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన

హాజీపూర్: మండలంలోని రాంపూర్‌లో కొట్టె రవి అనే రైతు పండించిన పత్తి పంటను పరిశీలించేందుకు ఓ ప్రైవేటు కంపెనీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు ఆదివారం క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. రైతు పత్తి పంట సాగు చేయగా దిగుబడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వినియోగించిన ఎరువులు, సోకిన తెగుళ్ల వివరాలపై ఆరా తీశారు.



రాజేశ్వర్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

పట్టణవాసికి విమలాశాంతి పురస్కారం

లక్షెట్టిపేట: పట్టణానికి చెందిన కవి లేదాళ్ల రాజేశ్వర్‌రావు అనంతపూర్‌కు చెందిన విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి నిర్వహించే పురస్కారానికి ఎంపికయ్యారు. ఆయన రచించిన అమ్మకు ఒక జత చెప్పులు కొనాలి కవితా సంపుటికి ఆదివారం అనంతపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు శాంతినారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ఛాయాచిత్ర గ్రాహకుల కార్యాలయం ప్రారంభం

తాండూరు: మండల ఛాయాచిత్ర గ్రాహకుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మొబైల్ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు ఎండీ ఈసా, శంకర్, బానయ్యలు రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఛాయాచిత్ర పోటీల్లో గెలుపొందిన ఛాయాచిత్ర గ్రాహకులకు బహుమతులు ప్రదానం చేశారు.

కుమురంభీం చూపిన బాటలో పయనించాలి

కాసిపేట(దేవాపూర్): ఆదివాసీ హక్కుల సాధనకు కుమురంభీం చూపిన బాటలో పయనించాలని ఆదివాసీ నాయకులు అన్నారు. మండలంలోని సాలెగూడెంలో ఆదివాసీ యూత్ ఆధ్వర్యంలో కుమురం భీం వర్ధంతిని నిర్వహించారు. ముందుగా డోలు వాయిద్యాల నడుమ ర్యాలీగా తరలివచ్చి నివాళులర్పించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఆ సంఘం అధ్యక్షుడు సిడం గణపతి, పెంద్రం ప్రభాకర్, మానిక్‌రావు, జంగు, గంగారం తదితరులు ఉన్నారు.

వర్షాలు కురవాలని పూజలు

భీమిని: వర్షాలు కురవాలని మహిళలు, భక్తులు ఊరు పోచమ్మ, భీమన్న దేవుడికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో గ్రామస్థులు, భక్తులు సమూహంగా బిందెల్లో నీరు తీసుకెళ్లి పోచమ్మకు అభిషేకం చేశారు. బోనంతో నైవేద్యం సమర్పించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

దండేపల్లి గ్రామీణం: యువత మద్యం, గంజాయివంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని లక్షెట్టిపేట సీఐ నరేందర్ అన్నారు. దండేపల్లి మండలం గూడెం ఒడ్డెర కాలనీలో ప్రజలకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఎస్సైలు ఉదయ్‌కిరణ్, సతీష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఉదారత

జన్నారం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1988-89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా కలిసి మిత్ర చారిటీని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తాము చదువుకున్న పాఠశాలకు చారిటీ ద్వారా నీటి శుద్ధీకరణ యంత్రాన్ని ఆదివారం ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్‌కు అందజేశారు. లింగన్న, కమలాకర్, వామన్, దేవేందర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, ఎండీ రహీమొద్దీన్, రమేశ్, గంగాధర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పోడియం అందజేత

జన్నారం: మురిమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలం పని చేసి బదిలీపై వెళుతున్న గణిత ఉపాధ్యాయుడు సంతోష్ పాఠశాలకు పోడియాన్ని, హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించిన తన్నీరు కోటేశ్వర్‌రావు ఆదివారం వేదిక తెరను అందజేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

జన్నారం, న్యూస్‌టుడే : మండలంలోని అల్లీనగర్ మారుమూల గ్రామానికి చెందిన రాయిసిడాం శ్రీహరి ఇటీవల డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా కొలువు సాధించాడు. సౌకర్యాలు అంతంతమాత్రమే ఉన్న గ్రామంలో పుట్టి కష్టపడి చదువుకున్నాడు. ఆదివారం అల్లీనగర్ గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అతడిని సత్కరించారు.